# అమెరికా సంబంధం

**కథ**

''అబ్బాయి అమెరికా నుండి సెలవుమీద ఇండియాకు వచ్చాడు. ఇక్కడ పదిహేను రోజులు ఉంటాడు. ఈ పదిహేను రోజుల్లోనే ఏడెనిమిది సంబంధాలు చూసి, ఏదో ఒకటి సెటిల్ చేసుకోవాలని వాళ్ల ఆలోచన. మీరు సరేనంటే మన అమ్మాయిని చూట్టానికి ఇవ్వాళ సాయంత్రం వాళ్లని తీసుకొస్తాను'' పెళ్లిళ్ల పేరయ్య మాటలకు ఆలోచనలో పడ్డారు రంగనాథం లక్ష్మి దంపతులు.

పక్కనే ఉన్న మరోగదిలో కాలేజీకి వెళ్లటానికి ముస్తాబవుతున్న రమ్య కూడా చెవులు రిక్కించింది తల్లిదండ్రులు ఏమాంటారోనని.

''సరే ముందయితే వాళ్లని సాయంత్రం అమ్మాయిని చూట్టానికి రమ్మని చెప్పండి, మిగిలిన విషయాలు తరువాత మాట్లాడుకుందాం.''

తండ్రి సమాధానం విని రమ్య బొత్తిగా నిరుత్సాహపడింది.

రమ్య ఎం.సి.ఎ చదువుతోంది. ఈ సంవత్సరంలో తన చదువు పూర్తవుతుంది. చదువు పూర్తయిన వెంటనే ఏదైనా మంచి ఉద్యోగం చేయాలని ఆమె అభిలాష. ఇప్పట్లో పెళ్లి చేసుకోవటం తనకు సుతరామూ ఇష్టం లేదు. పైపెచ్చు అమెరికా సంబంధాలంటే ఆమెకు ఒక విధమయిన భయం.

అయినా తనని అమితంగా ప్రేమించే తల్లిదండ్రుల మనసు నొప్పించలేక సాయంత్రం పెళ్లి చూపులకు సిద్ధపడింది.

ఆ సాయంత్రం పెళ్లి చూపుల్లో..

''నాతో పర్సనల్‌గా ఏదో మాట్లాడాలన్నారుట'' చిరునవ్వుతో ప్రశ్నించేడు అనురాగ్.

కళ్లెత్తి చూసింది రమ్య.

తన వేపే చూస్తూ కళ్లతో నవ్వుతున్న అనురాగ్ కనిపించగానే చప్పున కళ్లు వాల్చేసింది.

''ఎందుకలా సంకోచిస్తారు? ఏం మాట్లాడాలని అనుకున్నారో చెప్పండి'' ముందుకు వంగి స్నేహపూర్వకంగా అడిగేడు అనురాగ్.

ఓమారు చుట్టూ పరికించింది రమ్య. పెద్దలంతా తమకేమీ పట్టనట్టు దూరంగా ఉండి ఏవో మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుతం హాల్లో ఉన్నది తామిద్దరే. పైగా అనురాగ్ ప్రవర్తనలో సభ్యత, సంస్కారం ఉట్టిపడ్తున్నాయి. తను చెప్పదల్చుకుంది ధైర్యంగా చెప్పవచ్చున్న నమ్మకం కలిగింది రమ్యకు.

''చూడండి ఇంతకు పూర్వం మనం ఒకరినొకరం ఎరగం. నా క్వాలిఫికేషన్స్, ఫామిలి స్టేటస్ మీకు తెలుసు. అలాగే మీరు న్యూయార్క్‌లో కంప్యూటర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారనీ, మీ కుటుంబం అంతా హైదరాబాద్‌లోనే ఉండిపోయిందనీ నాకు తెలుసు. అంతకు మించి ఒకరి గురించి ఒకరికి మనకేం తెలీదు.''

అవునన్నట్టుగా చిన్నగా తల పంకించేడు అనురాగ్.

అనురాగ్ నుండి ఎటువంటి అభ్యంతరమూ లేకపోవటంతో మరింత ధైర్యంగా చెప్పింది రమ్య. ''ఇంక నా చదువు పూర్తవ్వలేదు. చదువు పూర్తయినా నా కాళ్లమీద నేను నిలబడేవరకూ పెళ్లి చేసుకోకూడదన్నది నా నిర్ణయం.''

''ఈ నెలతో మీ ఎగ్జామ్స్ అయిపోతాయనీ, దాంతో మీ చదువు పూర్తవుతుందనీ చెప్పారు మీ ఫాదర్. ఇంక మీ కాళ్ల మీద మీరు నిలబడటం అంటారా అమెరికా వచ్చాకా మీ క్వాలిఫికేషన్స్‌కి తగ్గ ఉద్యోగం మీరు నిరభ్యంతరంగా చేయవచ్చు'' మృదువుగా చెప్పేడు అనురాగ్.

చప్పున సిగ్గుతో తల దించుకుంది రమ్య. అనురాగ్‌కి తనెంతగా నచ్చిందీ ఆమెకు అర్ధమయిపోయింది.

''నా అభ్యంతరం అదొక్కటే కాదు'' ఆ తరువాత ఎలా మాట్లాడాలో అర్ధం కాక సంకోచంగా ఆగిపోయింది.

''ఆగిపోయారేం చెప్పండి రమ్యా!''

''నాకు అమెరికా సంబంధమంటే క్రేజులేదు. చెప్పలేని భయం కూడా. మా ఫ్రెండ్‌కు బోలెడంత డబ్బు ఖర్చుపెట్టి అమెరికాలో సెటిలయిన అబ్బాయినిచ్చి పెళ్లి చేసేరు. తరువాత తెలిసింది అతనికి ఆల్రెడీ పెళ్లయిపోయిందని. అందుకే నేను పెళ్లి చేసుకోబోయే వ్యక్తిగురించి పూర్తిగా తెలుసుకోందే పెళ్లి చేసుకోవటం నాకిష్టం లేదు. అలాగనీ ఇండియాలో మీరుండే

''ఇదెక్కడి విడ్డూరమండీ? పెళ్లి కాకుండానే అమ్మాయిని ఒంటరిగా ఉద్యోగానికని అమెరికా పంపించటమేమిటి? రేప్పొద్దున వాళ్లకు పెళ్లి కాకపోతే నలుగురిలో మన పరువేంగాను? అసలీ సంబంధమే వద్దు, మనమ్మాయికి వేరే సంబంధం చూద్దాం'' భర్తతో అంది లక్ష్మి.

పదిహేను రోజుల్లో మీ గురించి తెలుసుకోవటం సాధ్యం కాదు. అఫ్‌కోర్స్ మీరు మంచివారిలానే కనిపిస్తున్నారనుకోండి. అయినా నా నిర్ణయం మారదు'' దృఢంగా చెప్పింది రమ్య.

రమ్య మనోగతం అవగతమయ్యింది అనురాగ్‌కు.

''రమ్యా ఇక్కడికి రాకముందు ఈ పదిహేను రోజుల్లో ఏదో ఒక సంబంధం సెటిల్ చేసుకోవాలనే నిర్ణయంతో ఉన్నాను. కానీ మిమ్మల్ని చూశాక, ఆ తరువాత మీ ఆలోచనలు తెలుసుకున్నాక నా నిర్ణయం మారింది. ఎస్ మీరన్నది నిజం, పదిహేను రోజుల వ్యవధిలో నా గురించి మీరేమీ తెలుసుకోలేరు. అందుకే నేనో నిర్ణయానికొచ్చేను'' ఊపిరి పీల్చుకోటానికన్నట్టు కొద్దిక్షణాలు ఆగేడు.

ఆత్రంగా అనురాగ్ వేపు చూసింది రమ్య.

''నేను ఈసారి ఏం సంబంధం సెటిల్ చేసుకోకుండానే అమెరికా వెళ్లిపోతాను. రెండు, మూడు నెలల్లో ఎలాగూ మీ చదువు పూర్తవుతుంది. ఈలోగా మీ కోసం న్యూయార్క్‌లో ఓ మంచి ఉద్యోగం చూస్తాను. టిల్ దెన్ లెట్ అజ్ బి పెన్ ఫ్రెండ్స్. అమెరికా వచ్చాక నా గురించి పూర్తిగా తెలుసుకోండి. మీకు నేను పూర్తిగా నచ్చితేనే మనం పెళ్లి చేసుకుందాం. లేదంటే మంచి ఫ్రెండ్స్‌లా విడిపోదాం. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే మీరూ, మీ ఆలోచనా విధానం నాకు బాగా నచ్చాయి కాబట్టి''

అందమయిన రూపమే కాదు అందమయిన ప్రవర్తన కలిగిన అనురాగ్‌ని ఆరాధనాపూర్వకంగా చూసింది రమ్య.

ఆ తరువాత అంగీకార సూచనగా తల ఊపింది.

అనుకున్న ప్రకారం ఇప్పట్లో పెళ్లి వద్దని చెప్పేసి అమెరికా వెళ్లిపోయేడు అనురాగ్.

కానీ రమ్యకు మాత్రం తల్లి నుండి అభ్యంతరం ఎదురయ్యింది.

''ఇదెక్కడి విడ్డూరమండీ? పెళ్లి కాకుండానే అమ్మాయిని ఒంటరిగా ఉద్యోగానికని అమెరికా పంపించటమేమిటి? రేప్పొద్దున వాళ్లకు పెళ్లి కాకపోతే నలుగురిలో మన పరువేంగాను? అసలీ సంబంధమే వద్దు, మనమ్మాయికి వేరే సంబంధం చూద్దాం'' భర్తతో అంది లక్ష్మి.

''చూడు లక్ష్మీ మనం అమ్మాయిని అమెరికాకి ఉద్యోగం చేయటానికి పంపిస్తున్నాం. అంతేగాని పెళ్లి చేసుకోవటానికి కాదు. ఒకవేళ ఒకళ్లకు ఒకళ్లు నచ్చితే అప్పుడు వాళ్ల పెళ్లవుతుంది. ఏం అమ్మాయిలు ఉద్యోగాలకని ఢిల్లీ, కలకత్తా వంటి మహానగరాలకు వెళ్తున్నప్పుడు అమెరికాకు వెళ్తే తప్పేముంది? అయినా రమ్య తెలివయిన పిల్ల నువ్వేం భయపడకు'' భార్యకు నచ్చజెప్పేడు రంగనాథం.

అలా రమ్యకు అమెరికా వెళ్లటానికి లైన్ క్లియర్ అయ్యింది.

★★★

కాలగర్భంలో ఆర్నెల్లు గడిచిపోయేయి.

ఆరోజు అనురాగ్ నుండి వచ్చిన ఉత్తరాన్ని ఆత్రంగా చదవటం మొదలుపెట్టింది రమ్య.

''రమ్యా,

అయామ్ వెరీ హాపీ విత్ యువర్ ప్రోగ్రెస్. అమెరికాలో మీకు అన్నివిధాల అనుకూలమయిన ఉద్యోగం చూసేను. మీరు అమెరికా రావటానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మీరు ఇక్కడికి రావటానికి కావల్సిన ఫామ్స్ కూడా పంపిస్తున్నాను. మిగిలిన ఫార్మాలిటీస్ ఏమయినా ఉంటే కంప్లీట్ చేయండి.

ఇహ మీకు నా ప్రత్యేకమయిన థాంక్స్. ఎందుకంటారా ఇండియాకు వచ్చినప్పుడే పెళ్లి చేసుకునుంటే మీ స్నేహం తాలూకు పరిమళాన్ని ఆస్వాదించగలిగే అదృష్టం నాకుండేది కాదు. ఇంతటి అదృష్టాన్ని నాకు కలిగించిన మిమ్మల్ని త్వరలో కలుసుకోవాలని అభిలషిస్తూ,

ఫ్రెండ్లీ అనురాగ్.''

కొన్ని క్షణాలు రమ్య కనులు అరమోడ్పులయ్యేయి. 'తనెంత అదృష్టవంతురాలు. అనురాగ్ వంటి వ్యక్తితో పరిచయం ఆపైన అన్నీ సవ్యంగా ఉంటే పెళ్లి. ఓహ్!' ఈ ఆర్నెల్లలో అనురాగ్, రమ్యల మధ్య మంచి స్నేహం చిగురించింది. దాంతో అమెరికా వెళ్లాలంటే రమ్యకు పెద్దగా భయం వేయలేదు. అమెరికాలో ప్లేస్‌మెంట్ దొరకటంతో వీసా కూడా తేలిగ్గానే దొరికింది రమ్యకు.

★★★

''వెల్‌కం టు యు.ఎస్.ఎ.'' రమ్యకు ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలికేడు అనురాగ్.

కొద్ది క్షణాల సౌకర్యవంతమయిన ప్రయాణానంతరం కారు ముచ్చటయిన ఇంటి ముందు ఆగింది.

సందేహిస్తూ కారు దిగింది రమ్య.

భయం భయంగా ఇంట్లోకి అడుగుపెట్టింది.

ఇంటినీ, ఇంట్లో ఉన్న అందమయిన ఫర్నిచర్‌ని గమనించే స్థితిలో లేదామె.

''మనిద్దరం కలిసి ఈ ఇంట్లో ఉండాలా?'' భయంగా ప్రశ్నించింది.

రమ్య భయాన్ని చూసి హాయిగా నవ్వేశాడు అనురాగ్.

''భయపడకండి. మీరుండటానికి పక్కనే ఉన్న తెలుగువాళ్లింట్లో ఓ విశాలమయిన రూమ్ చూసేను. మీరక్కడ కంఫర్టబుల్‌గా ఉండొచ్చు. ఇది మనం ఉండబోయే..సారీ నేనుంటున్న ఇల్లు. మీకు చూపిద్దామని ముందుగా ఇక్కడికి తీసుకొచ్చేను''

అనవసరమయిన తన భయానికి తనే సిగ్గుపడింది రమ్య.

మర్నాడు రమ్యను తన కారులోనే పికప్ చేసుకుని ఆఫీసుకు తీసుకువెళ్లేడు అనురాగ్.


''ఏం భయపడకండి ధైర్యంగా లోపలికెళ్లండి. ఏమైనా అవసరం అయితే ఫోన్ చెయ్యండి. నేను సాయంత్రం వచ్చి మిమ్మల్ని తీసుకెళ్తాను'' తన విజిటింగ్ కార్డుని రమ్యకి ఇచ్చి వెళ్లిపోయాడు అనురాగ్.

★★★

జీవితం ఉన్నట్టుండి అద్భుతంగా మారిపోయినట్టనిపించింది రమ్యకు.

ఉదయం, సాయంత్రం, అనురాగ్ తనను కారులో పికప్ చేసుకుంటాడు. రోజూ సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వెళ్లగానే రమ్య కాఫీ చేస్తుంది. కాఫీ తాగుతూ ఇద్దరూ కాసేపు మాట్లాడుకుంటారు. అవసరం అనుకుంటే ఎటైనా షాపింగ్‌కు వెళ్తారు. లేదంటే ఎవరింట్లో వాళ్లుండిపోతారు.

అనురాగ్ మంచితనం, సంస్కారం రమ్యను అనురాగ్‌కు ఎంతగానో దగ్గర చేశాయి. అనురాగ్ పట్ల తనకున్న



ఒకప్పటి భయాన్ని తలుచుకుని అప్పుడప్పుడూ తనలో తనే నవ్వుకుంటుంది రమ్య.

ఇప్పుడు అనురాగ్ అంటే రమ్యకు ప్రాణం. అనురాగ్‌ని పెళ్లాడాలని ఆమె మనసారా కోరుకుంటోంది.

అందుకే తన అభిప్రాయం చెప్పమంటూ తండ్రి ఫోన్ చేసినప్పుడు రమ్య తన అంగీకారాన్ని తెలియజేసింది.

ఇంకేముంది ఇరుపక్షాల పెద్దలూ మంతనాలు జరిపి అనురాగ్ అంగీకారంతో ముహూర్తం నిర్ణయించేరు.

అనురాగ్‌తో తన పెళ్లికి ముహూర్తం నిర్ణయించేరన్న వార్త తెలియగానే రమ్య మనసు పురివిప్పిన నెమలే అయ్యింది.

ఎప్పటిలాగా సాయంత్రం ఇంటికి వచ్చిన అనురాగ్‌తో ఫ్రీగా మాట్లాడలేకపోయింది రమ్య.

రమ్య సిగ్గుని గమనించిన అనురాగ్ పెదాల మీద చిన్న చిర్నవ్వు మెరిసింది.

''థాంక్స్'' అల్లరిగా అన్నాడు.

''దేనికి?'' బిడియంగా అడిగింది రమ్య.

''దేనికా నన్ను పెళ్లి చేసుకోటానికి ఒప్పుకున్నందుకు''

''.......''

''అవునూ ఇప్పటికయినా నీకు నేను మంచివాడిననీ, నాకు ఇదివరకే పెళ్లి కాలేదనీ, నమ్మకం కుదిరిందిగా'' అల్లరిగా అడిగేడు అనురాగ్.

''ఛీ పొండి'' సిగ్గుతో కళ్లు వాల్చుకుంది రమ్య.

తమకంగా తననే చూస్తున్న అనురాగ్‌ని చూసి చిన్నగా నవ్వింది.

''నేనెంత అదృష్టవంతురాలిని'' పరవశంగా అంది.

''ఎందుకు?''

''ఎందుకేమిటి ఎంచక్కా నాకు అమెరికా సంబంధం సెటిలయ్యినందుకు''

''అయితే నేను కూడా అదృష్టవంతుడ్నే!''

''.......''

''ఎందుకని అడగవేం?''

''......''

''నాక్కూడా అమెరికా సంబంధం సెటిలయ్యినందుకు'' కొంటెగా నవ్వేడు అనురాగ్.

ఇద్దరూ ఒకళ్ల కళ్లల్లోకి ఒకళ్లు చూసుకుంటూ ఫక్కున నవ్వేరు. ★

**పులిపాక కనకదుర్గ**